క్లుప్తంగా

మహిళా ఓటర్లే అధికం

గన్నవరం: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉంది. గన్నవరం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ ఎన్ఎస్.పవన్ కుమార్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఓటర్ల జాబితాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఓటర్లు 2,79,054 మంది ఉన్నారన్నారు. పురుష ఓటర్లు 1,34,226 మంది, మహిళా ఓటర్లు 1,44,816 మంది, ట్రాన్స్‌జెండర్లు 12 మంది ఉన్నారన్నారు. పోస్టల్ బ్యాలెట్లు జారీకి సంబంధించి ఈ నెల 26తో గడువు ముగుస్తుందన్నారు. ఫెలిసిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఎలాట్ అయ్యాక ఓటింగ్ వేయడానికి అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నుంచి రామిశెట్టి వెంకటేశ్వరరావు, నీలం ప్రవీణ్‌కుమార్, బీజేపీ, టీడీపీ, సీపీఎం నాయకులు నాదెండ్ల మోహన్, ఆళ్ల గోపాలకృష్ణారావు, వై.నరసింహారావు పాల్గొన్నారు.

పెనమలూరులో 2,94,928 మంది ఓటర్లు

పెనమలూరు: సాధారణ ఎన్నికలకు సంబంధించి పెనమలూరు నియోజకవర్గం తుది ఓటర్ల జాబితాను అధికారులు గురువారం ప్రకటించారు. ప్రస్తుతం మొత్తం ఓటర్లు 2,94,928 మంది ఉన్నారు. పురుష ఓటర్లు 1,42,349 మంది, మహిళా ఓటర్లు 1,55,577 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



పెనమలూరు: కానూరు షాంరాక్ ఇంటర్నేషనల్ పాఠశాలలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పాఠశాలలో బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ సొంగా రత్నమంజుల చిన్నారులకు పట్టాలు ప్రధానం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలు ఆటపాటలతో పాటు విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ టి.సుమన్‌త్యాగరాజు, అధ్యక్షురాలు మౌనికాసుమన్, ప్రిన్సిపాల్ డాక్టర్ భారతీధర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

పెనమలూరు: కొద్ది రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైన వ్యక్తి గురువారం కృష్ణానదిలో శవమై తేలాడు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికగర్‌కు చెందిన జక్కంపూడి నాగరాజు(29) అవివాహితుడు. హౌస్‌కీపింగ్ పని చేస్తాడు. అతని ఇంటి ఎదురుగా ఉండే లాల్‌బీ కోరిక మేరకు బంగారు చెవి బుట్టలు తాకట్టు పెట్టి డబ్బు తీసుకువచ్చి ఆమెకు ఇచ్చాడు. తాకట్టు పెట్టిన బంగారు చెవి బుట్టల విషయంలో ఆమెకు నాగరాజుకు మధ్య వివాదం తలెత్తడటంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు నాగరాజుపై కేసు నమోదు చేశారు. గత నెల 15 నుంచి నాగరాజు కనిపించలేదు. కాగా ఈ నెల 22న నాగరాజు సోదరికి వాట్సాప్ మెసేజ్ చేశాడు. బైక్, ఫోన్, లెటర్ ప్రకాశం బ్యారేజ్ వద్ద ఉంచానని మెసేజ్‌లో పేర్కొన్నాడు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రకాశం బ్యారేజీ వద్దకు వెళ్లి చూడగా బైక్, వస్తువులు ఉన్నాయి. అయితే నాగరాజు కనబడలేదు. దీంతో నాగరాజు తల్లి వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు. అతని కోసం గాలించగా గురువారం కృష్ణానదిలో శవమై కనిపించాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కొనసాగుతున్న తిరునాళ్ల



ఉంగుటూరు: తేలప్రోలులో రంగమ్మ పేరంటాల తిరునాళ్ల మూడో రోజైన గురువారం వైభవంగా కొనసాగుతున్నాయి. పరిసర గ్రామాల నుంచి భక్తులు ప్రభ బండ్లతో ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి తమ మొక్కుబడులను చెల్లించుకుంటున్నారు. అర్ధరాత్రి అమ్మవారి ఊయల ఊగే కార్యక్రమం ఆ సమయంలో భక్తులు ఆలయం వద్దకు చేరుకుని భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని తిలకించారు. తిరునాళ్లను జక్కా వారసులు పర్యవేక్షించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

గన్నవరం.. జనసంద్రం

- కోలాహలంగా ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వంశీమోహన్ నామినేషన్ దాఖలు
- జై జగన్.. జై వంశీ నినాదాలతో దద్దరిల్లిన గన్నవరం
- ప్రతి గ్రామం నుంచి తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- అడుగడుగునా నీరాజనాలు పలికిన ప్రజలు



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వంశీమోహన్



గన్నవరంలో వంశీమోహన్‌కు గజమాల వేస్తున్న అభిమానులు



జై జగన్.. జై వంశీ అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు



ట్రాక్టర్లు, జీపులతో ర్యాలీగా వస్తున్న పార్టీ శ్రేణులు



ఉప్పొంగిన అభిమానం



తేలప్రోలు నుంచి ర్యాలీగా వస్తున్న నాయకులు

గన్నవరం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ నామినేషన్ సందర్భంగా గన్నవరం జనసంద్రమైంది. వంశీమోహన్‌కు మద్దతుగా నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు వేలాదిగా తరలిరావడంతో పట్టణంలోని రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. డీజే సౌండ్స్, తీన్‌మార్ డప్పులు, యువకులు, మహిళల కోలాహలం మధ్య ర్యాలీ అత్యంత ఉత్సాహంగా సాగింది. తొలుత దావాజిగూడెం రోడ్డులోని వంశీ నివాసం వద్ద గోపూజ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి వంశీమోహన్ పాల్గొన్నారు. అనంతరం ఉంగుటూరు జెడ్పీటీసీ డాక్టర్ దుట్టా సీతామహాలక్ష్మి, పార్టీ వైద్య విభాగం రాష్ట్ర నాయకులు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి, అశేష జనవాహినితో కలిసి ఆయన నామినేషన్ వేసేందుకు ప్రదర్శనగా బయలుదేరారు. భారీగా తరలివచ్చిన జనం దారి పొడవునా వంశీమోహన్‌పై పూల వర్షం కురిపిస్తూ గజమాలలతో సత్కరిస్తూ అభిమానం చాటుకున్నారు. ప్రచార రథంపై నుంచి అందరికి అభివాదం చేస్తూ ముందుకుసాగారు. రెండు కిలోమీటర్ల దూరంలోని గాంధీబొమ్మ సెంటర్‌కు ర్యాలీ చేరుకునేందుకు గంటన్నర సమయం పట్టింది. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఆయన సతీమణి పంకజశ్రీ, డాక్టర్ సీతామహాలక్ష్మి దంపతులు, పార్టీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్‌తో కలిసి వంశీమోహన్ మరో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వో గీతాంజలిశర్మకు అందజేశారు. నాలుగు మండలాలకు చెందిన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వంశీమోహన్‌కు స్వల్ప అస్వస్థత

నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో వంశీమోహన్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. భారీగా తరలివచ్చిన జనంతో పాటు ట్రాఫిక్ సమస్యల కారణంగా ర్యాలీ షెడ్యూల్ కంటే ఆలస్యంగా మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైంది. ఎండ తీవ్రత కారణంగా స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్దకు రాగానే వంశీమోహన్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో ర్యాలీ మధ్యలో నిలిపివేసి నామినేషన్ వేసేందుకు తహసీల్దార్ కార్యాలయానికి బయలుదేరారు. అక్కడ కొంత సమయం విశ్రాంతి తర్వాత ఆయన తెరుకున్నారు.

రూరల్ మండలం నుంచి..

రామవరప్పాడు: వంశీమోహన్ నామినేషన్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని విజయవాడ రూరల్ మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్లు, కన్వీనర్లు, కార్యకర్తలు, అభిమానులు వేలాది మంది గన్నవరం తరలివెళ్లారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి పలు గ్రామాల నుంచి గొల్లపూడి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ర్యాలీగా వెళ్లారు. వీరంతా దావాజిగూడెం రోడ్డు కల్యాణి టవర్స్ వద్ద సమీకరణమై ర్యాలీలో పాల్గొన్నారు.

తేలప్రోలు నుంచి ర్యాలీ

ఉంగుటూరు: వంశీమోహన్ నామినేషన్‌కు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు గన్నవరం తరలివెళ్లారు. తేలప్రోలులో మండల జేసీఎస్ కన్వీనర్ వింత ఆదినారాయణరెడ్డి, భీమవరపు యతేంద్ర రామకృష్ణ నేతృత్వంలో ర్యాలీగా వెళ్లారు. అదే విధంగా ఆత్కూరు, పొట్టిపాడు, మానికొండ, ఉంగుటూరు, ఇందుపల్లి, పెద్ద అవుటపల్లి, తదితర గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు వంశీమోహన్ నామినేషన్‌కు హాజరయ్యారు.



నామినేషన్‌కు వెళ్తున్న జంక్షన్ నాయకులు, కార్యకర్తలు

భారీగా వాహనాల ర్యాలీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వంశీమోహన్ నామినేషన్‌కు బాపులపాడు మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి సుమారు 12 వేల మంది బైక్‌లు, 900 ఆటోలు, 250 కార్లు, ఇతర వాహనాల్లో గన్నవరం బయలుదేరి వెళ్లారు. స్థానిక విజయవాడరోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద బైక్ ర్యాలీని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, పార్టీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జేసీఎస్ మండల కన్వీనర్ ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైస్ ఎంపీపీ చందు రమాదేవి, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌మూర్తి వాహన ర్యాలీని ప్రారంభించారు. జోహార్ వైఎస్సార్, జై జగన్, జై వంశీ నినాదాలతో రహదారులు మారుమోగాయి. గన్నవరం వైపు వెళ్లే రోడ్లన్నీ వైఎస్సార్ సీపీ శ్రేణులతో నిండిపోయాయి. వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడుతూ, కార్యకర్తలు ఉత్సాహం నడుమ ర్యాలీ సందడిగా సాగింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా పార్టీ శ్రేణులు ర్యాలీగా బయలుదేరి వెళ్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు.



నున్న నుంచి నామినేషన్‌కు వెళ్తున్న కార్యకర్తలు

వంశీమోహన్ గెలుపే ధ్యేయం

నున్న(విజయవాడరూరల్): వంశీమోహన్ గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని మాజీ ఎంపీపీ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అన్నారు. వంశీ నామినేషన్‌కు నున్న గ్రామంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి అత్యధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. గ్రామపార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డితో కలిసి యర్కారెడ్డి నాగిరెడ్డి వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కాటూరి సరళ, ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పోలారెడ్డి ప్రసాదరెడ్డి, బొంతు సరోజిని, ప్రత్తిపాటి రవీంద్ర, పెండెం గిరిజాకుమారి, జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడు బొమ్మిన శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ నాగరాజు, నాయకులు భీమవరపు శివరామిరెడ్డి, అంగజాల హనుమా, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తగరం రవీంద్ర, మండల ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు గుడ్డేటి రాజేష్, కార్యకర్తలు పాల్గొన్నారు. పాతపాడు గ్రామం నుంచి మండల పార్టీ కన్వీనర్ దేవగిరి ఓంకార్‌రెడ్డి, కలపాల అబ్రహం ఆధ్వర్యంలో కార్యకర్తలు వాహనాల్లో గన్నవరం వెళ్లారు. పి.నైనవరం గ్రామంలో గ్రామ పార్టీ కన్వీనర్ దావు వెంకటేశ్వరావు, సర్పంచి బట్టా చిన్నబ్బాయి ఆధ్వర్యంలో, అంబాపురం గ్రామంలో గ్రామ పార్టీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్, కో కన్వీనర్ తోడేటి బెంజిమెన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు నామినేషన్ కార్యక్రమానికి వెళ్లారు.

ట్రాక్టర్లతో రైతుల ర్యాలీ

గన్నవరంరూరల్: మండలంలోని గ్రామాల్లో గురువారం వైఎస్సార్ సీపీ సంబరాలు అంబరాన్నంటాయి. వంశీమోహన్ నామినేషన్‌తో గ్రామాల్లోని రహదారులు పార్టీ శ్రేణులతో నిండిపోయాయి. సూరంపల్లి రాళ్లకట్ట సెంటర్ వద్ద గ్రామ పార్టీ నాయకులు ర్యాలీని ప్రారంభించారు. కొత్త బైపాస్ హైవే మీదుగా గన్నవరం చేరుకుంది. జై జగన్.. జై వంశీ నినాదాలతో మారుమోగింది. రైతులు ట్రాక్టర్లకు వైఎస్సార్ సీపీ జెండాలు కట్టుకుని ఆర్‌బీకేల ద్వారా రైతును రాజును చేసిన మహనీయుడు మా జగన్ అంటూ నినాదాలు చేశారు. రూరల్ మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు ఉత్సాహంగా నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జెండాను రెపరెపలాడిస్తాం

గన్నవరం: రానున్న ఎన్నికల్లో గన్నవరంలో వైఎస్సార్ సీపీ జెండాను రెపరెపలాడిస్తామనని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నామినేషన్ వేసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. తన 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలకు పెద్ద ఎత్తున్న మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంతో పాటు సాంఘికంగా, రాజకీయంగా ముందుకు నడిపించారన్నారు. విద్య, వైద్యం సహా అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. కోవిడ్ సమయంలో దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యుత్తమ వైద్య సేవలందించిందన్నారు. కోవిడ్‌లో ఆర్థిక పరిస్థితి క్షీణించిన సంక్షేమ పథకాలు ద్వారా అన్నగా, తమ్ముడిగా, మనవడిగా, మిత్రుడిగా ప్రతి కుటుంబాన్ని ఆదుకున్నారని చెప్పారు. రాష్ట్రం అప్పులు పాలవుతుందని, శ్రీలంక అవుతుందని చెప్పిన టీడీపీ ఇప్పుడు మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మరోసారి మోసగించాలని చూస్తుందన్నారు. చంద్రబాబు ఆవుట్ డేటెడ్ నాయకుడని, స్వప్రయోజనాలు తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టావని చెప్పారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా తనను నిలబెట్టి ప్రజలకు మరోసారి అవకాశం కల్పించిన సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. తన మిత్రుడు కొడాలి నాని, ఎంపీ అయోధ్యరామిరెడ్డి, పార్టీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు ఆశీస్సులు, నియోజకవర్గ ప్రజలందరి మద్దతుతో నామినేషన్ దాఖలు చేశానన్నారు. వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. వంశీమోహన్‌ను భారీ మెజార్టీతో గెలిపించి సీఎం వైఎస్ జగన్‌కు కానుకగా ఇస్తామని బాపులపాడు జెడ్పీటీసీ డాక్టర్ దుట్టా సీతామహాలక్ష్మి, వైద్య విభాగం రాష్ట్ర నేత డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి తెలిపారు.

మలేరియా రహిత సమాజ స్థాపనే లక్ష్యం

ఉయ్యూరు: మలేరియా రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మలేరియా అధికారి బి.రామారావు అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్, కాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం గురువారం నిర్వహించారు. మలేరియాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు చేపట్టారు. మలేరియా వ్యాప్తి చెందకుండా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. 2027 నాటికి మలేరియా మరణాలు లేకుండా చేయటం, 2030 నాటికి మలేరియా కేసులను నిర్మూలించాలనే లక్ష్యాలను సాధిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు శివరామకృష్ణ, గోపిచంద్, సిబ్బంది పాల్గొన్నారు.

కంకిపాడు: దోమల నిర్మూలనతో ప్రజారోగ్యం మెరుగుపడుతుందని, అనారోగ్యాలు దరిచేరవని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సంతోష చంద్రిక అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉప్పలూరు గ్రామంలో గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డాక్టర్ సంతోష చంద్రిక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. వాడి పారేసిన కొబ్బరి బోండాలు, పాత టైర్లు, పాడైన ఫ్రిజ్‌లు మొదలైనవి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతాయన్నారు. కార్యక్రమంలో మరో వైద్యాధికారి డాక్టర్ సాయి నిఖిత, ఎంపీహెచ్‌ఈఓ కృష్ణారావు, సబ్ యూనిట్ అధికారి జి.శ్రీనివాసరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెనమలూరు: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని కానూరులో గురువారం విద్యార్థులు నిర్వహించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివరాలు తెలుపుతూ మలేరియా వచ్చిన వారికి ఆకస్మాత్తుగా విపరీతమైన జ్వరం, చలితో వణుకు, శరీర ఉష్ణోగ్రత పెరుగుతూ ఉండటం, చెమటలు పట్టడం, నీరసం, జ్వరం వస్తూ పోతుండటం జరుగుతుందన్నారు. రక్త పరీక్షలు చేయించుకోని మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నేడు పలు గ్రామాల్లో మంత్రి జోగి రమేష్ ప్రచారం

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థి జోగి రమేష్ శుక్రవారం పర్యటించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి పునాదిపాడు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నారు. అనంతరం 10 గంటలకు అదే గ్రామంలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ సార్వత్రిక ఎన్నికల సన్నద్ధంపై జగనన్నకు మద్దతుగా జోగన్న గెలుపు కోసం సిద్ధం సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 4.30 గంటల నుంచి కోలవెన్ను గ్రామంలో సిద్ధం సమావేశం, 6 గంటల నుంచి ఉయ్యూరు పట్టణంలోని పలు వార్డుల్లో గడప గడపకు కార్యక్రమం నిర్వహించి ప్రజలను కలుస్తారని మంత్రి కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది.

ఉయ్యూరులో ముమ్మరంగా ప్రచారం



ఉయ్యూరు పట్టణంలో ఓట్లు అభ్యర్థిస్తున్న మంత్రి జోగి రమేష్

ఉయ్యూరు: ప్రజాశీర్వాదంతో పెనమలూరు గడ్డపై వైఎస్సార్ సీపీ జెండాను ఎగరేస్తామని రాష్ట్ర మంత్రి, పెనమలూరు అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వ్యాపారులు, దుకాణదారులు, స్థానికులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ విజయాన్ని అందించాలని విజ్ఞప్తిచేశారు. మంత్రి రమేష్ మాట్లాడుతూ ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పాలనతో లబ్ధిపొందిన వారంతా ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమ అభిమానాన్ని చాటుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కూటమి మాయమాటలు నమ్మే పరిస్థితిలో జనం లేరన్నారు. జగనన్నపై పూర్తి విశ్వాసంతో ఉన్నారన్నారు. మంచి జరగాలన్నా, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందాలన్నా మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలని స్పష్టంచేశారు. పార్టీ నియోజకవర్గ నేతలు దేవినేని స్మిత, దేవినేని గౌతమ్, పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, కౌన్సిలర్లు గుంజా సుధాకర్, గోన మదన్, ముడావత్ లక్ష్మి, జంపాన పూర్ణిమ, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, ప్రభుత్వాస్పత్రి చైర్మన్ జంపాన కొండలరావు, నాయకులు ఉక్కు కాకాని మనవడు కాకాని విజయ్‌కుమార్, పాగిరి రాము, ముడావత్ బ్రహ్మం, వెంట్రప్రగడ బాబ్జీ, అబ్దుల్ సద్దాం, ఊర కిషోర్, సలీంబేగ్, కొండపల్లి రమేష్, అహ్మద్ ఖాన్, ఊర నాగిన్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలన అందించిన జగనన్న



యనమలకుదురులో ప్రచారం నిర్వహిస్తున్న జోగి రాజీవ్

పెనమలూరు: రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పాలన అందించారని మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. ఆయన యనమలకుదురులో గురువారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగనన ఇచ్చిన హామీలు అమలు చేశారన్నారు. ఈ ఎన్నికల్లో తిరిగి జగనన్నను గెలిపించితే రానున్న ఐదేళ్ల పాటు సంక్షేమ పాలన అందుతుందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు కేవలం అధికారం కోసం తాపత్రాయ పడుతున్నాయని, వారికి ప్రజల సంక్షేమంతో పని లేదని ఆరోపించారు. ప్రజలు వాస్తవాలు గమనించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జోగి రమేష్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మరీదు శ్రీనివాసరావు, కోసూరి నరేష్‌కుమార్, ఈడే చాముండేశ్వరి అష్రఫ్, వినయ్, సలీం, యార్లగడ్డ వీరబాబు, లతీఫ్, కరీం, బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

కంకిపాడు: సార్వత్రిక ఎన్నికల్లో తొలి అంకం పూర్తయ్యింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారంతో ముగిసింది. దాఖలైన నామినేషన్లను అధికారులు శుక్రవారం పరిశీలించనున్నారు. అన్ని వివరాలు ఖచ్చితంగా నమోదు చేసిన నామినేషన్లను అంగీకరించి మిగిలిన నామినేషన్లను తిరస్కరించనున్నారు.

తొమ్మిది నామినేషన్లు

గన్నవరం: గురువారం తొమ్మిది మంది అభ్యర్థులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేశారు. భారీగా ర్యాలీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ నామినేషన్ పత్రాలను ఆర్వో గీతాంజలిశర్మకు అందజేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా దొండపాటి ఆనంద్‌ప్రసాద్, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా పి.రవిచంద్రకుమార్, టీడీపీ అభ్యర్థి తరుపున ఆ పార్టీ నేతలు మరో సెట్, యార్లగడ్డ సతీమణి జ్ఞానేశ్వరి మరో సెట్ నామినేషన్లు సమర్పించారు. జైమహా భరత్ పార్టీ అభ్యర్థిగా గుడూరు వెంకట రవికుమార్, స్వతంత్ర అభ్యర్థులుగా మదాసు వరలక్ష్మి, జి.సుధీర్‌కుమార్ నామినేషన్లు వేశారు.

పెనమలూరులో ఆరు నామినేషన్లు

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గ ఎన్నికల్లో చివరి రోజు గురువారం ఆరు నామినేషన్లు అందాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రాజు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వెలిశల సుబ్రహ్మణ్యం, భారత చైతన్య యువజన పార్టీ నుంచి గుర్రాల హర్షిత, జై భారత్ నేషనల్‌పార్టీ నుంచి లంకా కరుణాకర్‌దాస్ నామినేషన్ వేశారు. అదే విధంగా జాతీయ జనసేన పార్టీ నుంచి జి.సీతారామయ్య, జై భీమ్‌రావు భారత్ పార్టీ నుంచి సదర్ల ప్రసాదరావు, స్వతంత్ర అభ్యర్థిగా డి.సతీష్, టీడీపీ నుంచి బోడెప్రసాద్ నామినేషన్ వేశారు. కాగా శుక్రవారం నామినేషన్ పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ఈ నెల 29వ తేదీ వరకు ఉంది. అదే రోజు సింబల్స్ కూడా ప్రకటిస్తారు.